క్లుప్తంగా

రేపటి నుంచి ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం క్వార్టర్స్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన, పుప్పాలగూడ రెవెన్యూ అవతార్ టవర్స్ సమీపంలోని స్వయంభు సంకట హరణ శ్రీహనుమాన్ దేవాలయం ఆవరణలో నవగ్రహాల ప్రతిష్ఠాపన పూజలను గురు, శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నామని ఆయా ఆలయాల కమిటీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు గణపతిపూజ, గోపూజ, జపాలు, హోమాలతో పూజలు ప్రారంభమై శనివారం ఉదయం 9.18 గంటలకు ప్రతిష్ఠాపన పూజలు జరుగుతాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద్ద మహిళా దినోత్సవం

రాజేంద్రనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భారత రాష్ట్రీయ సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు యాదమ్మయాదవ్ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌లు హాజరవుతారన్నారు. స్థానిక ప్రాంతాల మహిళలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

క్రైం కార్నర్..

ఉరి వేసుకుని వ్యక్తి మృతి


మృతి చెందిన రాజ్‌కిషోర్

రాజేంద్రనగర్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజ్‌కిషోర్(39), సుస్మిత భార్యాభర్తలు. రాజ్‌కిషోర్ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మిగూడలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం సుస్మిత తన కుమారుడితో కలిసి దేవాలయానికి వెళ్లింది. ఆ సమయంలో రాజ్‌కిషోర్ నిద్రిస్తున్నాడు. తిరిగి వచ్చి చూసే సరికి అతడు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీ-20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఐఎస్‌బీ

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) జీ-20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌నకు నాలెడ్జి పార్ట్‌నర్‌గా మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్(ఎంఎస్‌డీఈ) ఆధ్వర్యంలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎస్‌డీసీ)తో సహకరించేందుకు అంగీకరించారు. ఈ మేరకు మంగళవారం ఐఎస్‌బీ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్‌లో పరిశోధనలు, నాయకత్వ మద్దతును ఎన్ఎస్‌డీసీకి ఐఎస్‌బీ అందిస్తుంది. జీ-20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ కోసం నాలెడ్జి కొలేటరల్‌ను రూపొందించడంలో ఐఎస్‌బీ సహాయం చేస్తుంది. ఐఎస్‌బీ డిప్యూటీ డీన్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రొఫెసర్ దీపామణి మాట్లాడుతూ జీ-20ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌కి పరిశోధన, విజ్ఞాన మద్దతును అందించడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్‌డీసీ సీఈఓ వేద్‌మణితివారి మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ధోరణులకు సాక్ష్యంగా ఉన్నందున భారతదేశం కీలక సమయంలో జీ-20 అధ్యక్ష పదవిని చేపట్టిందన్నారు. ప్రపంచ నైపుణ్యాల అంతరాన్ని పరిష్కరించడానికి సామాజిక సమానత్వాన్ని మెరుగుపర్చడానికి, నైపుణ్య పర్యావరణ వ్యవస్థలో స్థిరమైన అభివృద్ధిని మెరుగు పర్చడానికి ఇది ప్రత్యేకమైన అవకాశం అన్నారు. జీ-20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌నకు నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఐఎస్‌బీ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఫొటో ప్రదర్శన



మాదాపూర్: అరకు ప్రాంతంలో గ్రామీణ జీవన విధానాన్ని తెలిపే ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మంగళవారం మైలవరపు రమణి ఇన్‌విజుబుల్ రూట్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనను జేఎన్ఏఎఫ్‌యూ ప్రొఫెసర్ ఆనంద్ గడప ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, ఉదయం 10గంటల నుండి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు


శంషాబాద్ రూరల్: కాపుగడ్డ బస్తీలో కాముని దహనానికి ముందు పూజలు చేస్తూ...


మణికొండ: వట్టినాగులపల్లిలో...


హైదర్‌గూడలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


చిన్నారికి చిలుకల దండ వేసిన దృశ్యం

మణికొండ: మణికొండలో...


మణికొండ: నార్సింగిలో నిర్వహించిన హోలీ సంబరాల్లో వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్



మణికొండ: ఖానాపూర్‌లో...


శంషాబాద్ రూరల్: పిల్లోనిగూడలో కాముని దహనం

హోలీ సంబరాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మంగళవారం అంబరాన్నంటాయి. ఈ పర్వదిన వేడుకలో భాగంగా ముందు రోజైన సోమవారం రాత్రి వివిధ కాలనీలు, బస్తీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద కాముడి దహన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిన్నారులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేడుకలో పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా స్నేహితులు, బంధువులు ఒక చోట చేరి ఉత్సాహం హోలీ జరుపుకున్నారు.

భలే గిరాకీ..

హోలీ పర్వదినం సందర్భంగా రంగులతో పాటు టమాటాలకు, కోడి గుడ్లకు గిరాకీ భలేగా పెరిగింది. ఉదయం నుంచి చిన్నారులు, యువత రంగుల కోసం.. గుడ్ల కోసం దుకాణాలకు ఎగబడ్డారు. దీంతో కిరాణ, చికెన్ దుకాణాలతో పాటు మార్కెట్లు కిటకిటలాడాయి.

– రాజేంద్రనగర్ జోన్ బృందం


కామదహనానికి ముందు పూజలు చేస్తున్న అధ్యక్షుడు సీఎస్ రెడ్డి

ల్యాంకోహిల్స్‌లో..

మణికొండ: హోలీ పండగను పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ ల్యాంకోహిల్స్‌లో మంగళవారం రాత్రి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హోలీకి ముందు కామదహనాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంగులు చల్లుకుని, దాండియా ఆటలు, పాటలు, సాంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. వేడుకలో రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఎస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అర్జున్, కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శి కిషోర్, కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్, నివాసితులు పాల్గొన్నారు.


రంగులు చల్లుకుంటూ సంబరాల్లో నివాసితులు


బండ్లగూడ: కాళీమందిర్ వద్ద కాముడి దహనం..


బండ్లగూడ: ఓంనగర్ కాలనీలో హోలీ ఆడుతూ...


రాజేంద్రనగర్: హైదర్‌గూడలో హోలీ ఆడుతూ..


శంషాబాద్ రూరల్: ఊటపల్లిలో హోలీ సంబరాల్లో యువత


రాజేంద్రనగర్: హైదర్‌గూడలో హోలీ ఆడుతూ..


రాజేంద్రనగర్: బుద్వేల్‌లో...


రాజేంద్రనగర్: హైదర్‌గూడలో...


బండ్లగూడలోని జాగీర్‌లోని సాయిశక్తి సింపనీ రెసిడెంట్స్‌లో...

మహిళలకు పెద్దపీట: ప్రొఫెసర్ విజ్జులత



సుల్తాన్‌బజార్: మహిళా దినోత్సవం వేళ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని తొలి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.విజ్జులత అన్నారు. అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆమెను ప్రభుత్వం ఇన్‌చార్జ్ వీసీగా నియమించడాన్ని కళాశాల విశ్వ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది స్వాగతిస్తున్నారు. తాను ఇదే కళాశాల విద్యార్థినిగా, అధ్యాపకురాలుగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల సాదకబాధకాలు తెలుసున్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, ఆట స్థలాలు, అధ్యాపకులు, సిబ్బంది ఇతరాత్ర అవసరాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని వీసీ విజ్జులత 'సాక్షి'తో తెలిపారు. తెలంగాణలో మహిళా విశ్వ విద్యాలయంలో పెనుమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం కలిగేలా అధ్యాయనాలు చేసేలా ప్రోత్సహిస్తామని ఆమె తెలిపారు. రాష్ట్రంలోనే మహిళా విశ్వ విద్యాలయాన్ని ఎంతో పేరుగాంచే విధంగా తీర్చిదిద్దుతామని ఆమె అన్నారు. ఇప్పటికే ఈ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులుగా ఉన్న వారు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారి ప్రోత్సహం కూడా మాకు ఉందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎల్లంకి అనిల్‌కుమార్ సేవలు ఎనలేనివి

అఫ్జల్‌గంజ్: ప్రజా సంక్షేమానికి కృషి చేస్తూ అనాథ పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎల్లంకి అనిల్‌కుమార్ సేవలు వెలకట్టలేనివని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నానక్ రామ్ డిగ్రీ, సైన్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అనంతరం అఫ్జల్‌గంజ్‌లోని ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 ఏళ్లుగా మెల్బోర్న్ యునివర్సిటీ అడ్మినిస్ట్రేటర్‌గా విధుల నిర్వహిస్తున్న ఎల్లంకి అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

దేశపతి శ్రీనివాస్‌కు సన్మానం



అబిడ్స్: ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన కవి గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దేశపతి శ్రీనివాస్‌ను గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో అందరికీ సీఎం కేసీఆర్ తగిన ప్రాధాన్యమిస్తున్నారన్నారు. దేశపతి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల దినకర్, బొమ్మరాజు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని పూజారి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

మియాపూర్: ఓ పూజారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన ప్రకారం.. మర్రిగంటి ప్రశాంత్ (30) భార్య ప్రసన్న ఇద్దరు పిల్లలతో మియాపూర్‌లో నివాసముంటున్నారు. స్థానికంగా హనుమాన్ ఆలయంలో పూజారి. కొంతకాలంగా తల్లి, సోదరిలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఎవరు లేని సమయంలో తల్లి రూప గదికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో భార్య ప్రసన్న వెళ్లి తలుపు తట్టగా ఉలుకు పలుకు లేదు. దీంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతనిని కిందికి దించి దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి ప్రశాంత్ మృతి చెందాడని తెలిపారు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తల్లి, సోదరి వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ప్రసన్న మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుని భార్య ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

9న 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని ది మౌలానా ఆజాద్ చైర్ (ఎంఏసీ) ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ', 'దక్షిణి: ఏ హైబ్రిడ్ ల్యాంగ్వేజ్ ఆఫ్ ది బోర్డర్‌ల్యాండ్స్' అనే రెండు అంశాలపై హర్యానాలోని అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పెగ్గి మోహన్ మాట్లాడతారు.

నల్లగండ్లలో స్టూడియో 11 స్పా ప్రారంభం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో స్టూడియో 11 స్పాను ప్రభుత్వ విప్ గాంధీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ యువత అభిరుచులకు అనుగుణంగా సేవలందించాలన్నారు.కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షుడు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు కోమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'కేవీ విద్యార్థులకు అన్యాయం జరగనివ్వం'

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అన్యాయం జరుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2013లో హెచ్‌సీయూ కార్యనిర్వాహక మండలి(ఈసీ) నిర్ణయం మేరకు కేవీ-హెచ్‌సీయూ ప్రాజెక్ట్ మోడ్ కింద కేవీఎస్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. ఇందులో భాగంగా హెచ్‌సీయూ ఇప్పటి వరకు కేంద్రీయ విద్యాలయపై రూ.20 కోట్లు వెచ్చించిందన్నారు. ఈ విద్యా సంవత్సరంతో ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయను మూసి వేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు 2022 ఆగస్టులోనే కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు లేఖ రాసినట్లు వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయలో 8,9,10 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయని, విద్యార్థులకు క్యాంపస్ స్కూల్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మహిళలు ఐటీ రంగంలో రాణించాలి

- హైసియా ప్రెసిడెంట్ మనీషాసబూ
- వెస్టిన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం


వెస్టిన్ హోటల్‌లో వేడుకలను ప్రారంభిస్తున్న మనీషాసబూ తదితరులు

మాదాపూర్: మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని, ముఖ్యంగా ఐటీ రంగంలో రాణించాలని మనీషాసబూ (డెలివరీ హెడ్ ఇన్ఫోసిస్, హైసియా ప్రెసిడెంట్) తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో దిగ్గజ మహిళా లీడర్లతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ వ్యక్తిగత అభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్య, ఆత్మరక్షణ, సాధికారతపై దృష్టి సారించే విధంగా బహుళ కార్యకలాపాలను ప్లాన్ చేసినట్టు తెలిపారు. క్యారమ్. చెస్, ఇండోర్‌గోల్ఫ్, వినోద పుస్తకాలతో లైబ్రరీ, ఇండోర్ గేమ్‌ల కోసం స్పోర్ట్స్ కార్నర్ వంటివి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ప్రసంగించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ షబ్నంభక్షి, ఓపెన్ టెక్స్ట్ క్లౌడ్ సర్వీసెస్ డైరెక్టర్ పద్మినిరాజన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతి హైస్కూల్‌లో..

మాదాపూర్‌లోని స్వాతి హైస్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవీ పాల్గొన్నారు. మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలు వ్యాపార రంగంలో కూడా రాణిస్తున్నారని, ప్రభుత్వం వారిని మరింత ప్రోత్సహించాలని కోరారు. ప్రిన్సిపల్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.


గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

భారత్ సూపర్ పవర్‌గా ఎదగడానికి సమష్టి కృషి అవసరం

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్


డాక్టర్ వికే సారస్వత్‌కు జ్ఞాపికను అందిస్తున్న మాజీ వీసీ ప్రొ. అప్పారావు, వీసీ బీజేరావు

రాయదుర్గం: పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు విద్యాసంస్థలు తోడ్పడాలని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 'ఎస్పైర్' సంస్థ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఫౌండేషన్ లెక్చర్ కార్యక్రమంలో భాగంగా 'ఇండియాస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ భారతదేశం సూపర్ పవర్‌గా ఎదగడానికి ఉత్పత్తి ఆధారిత లోతైన సాంకేతిక ఆవిష్కరణల అభివృద్ధి, స్టార్టప్‌లు, పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో, చుట్టుపక్కల ఉన్న వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఎస్పైర్ ప్రయత్నాలను ప్రశంసించారు. అనంతరం ఎస్పైర్ ఇంక్యుబేటర్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పరిశోధనా సంస్థల అధిపతులు, ఫార్మా అండ్ బయోటెక్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, హెచ్‌సీయూ స్టార్టప్ కమ్యూనిటీ సభ్యులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.